క్లుప్తంగా

ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకోవాలి



మదనాపురం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న ఏడో తరగతి విద్యార్థి ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం చేస్తూ ఆ కుటుంబానికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ మండల నాయకులు కలెక్టర్ ఆదర్శ్‌సురభిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్లి రాజశేఖర్, నాయకులు మల్లేష్‌యాదవ్, రమేష్, కురుమన్న, రాములు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



ఆత్మకూర్: అండర్ 19 బాలికల వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఆత్మకూర్‌కు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని వాలీబాల్ కోచ్ అబ్దుల్‌ఖాదర్ తెలిపారు. శుక్రవారం నారాయణపేటలో జరిగిన అండర్ 19 వాలీబాల్ ఎంపికలో పట్టణానికి చెందిన సమీన, అనూష, ఐషు, శిరీష ఎంపికయ్యారని, వీరు డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో కోస్గిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పదవుల కంటే పార్టీ సేవే ముఖ్యం



వనపర్తిటౌన్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడినా, గెలిచిన ఆయన వెంటే ఉంటూ క్రమశిక్షణ కలిగిన కార్యకర్త నుంచి వివిధ హోదాల్లో కాంగ్రెస్‌కు సేవలందించినందుకు తనకు గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ) పదవి దక్కిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్నారెడ్డి దయతో పాటుగా ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో తనకు జీపీగా అవకాశం వచ్చిందన్నారు. అనవతరం ఏపీఐసీ రాష్ట్ర కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, నాయకులు రాగివేణు, అనిస్, బాబా, పరశురాం, అబ్దుల్లా, వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లెల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కోళ్ల వెంకటేష్, నాగరాజు, గణేష్, జాన్, శేఖర్, దేవన్న తదితరులు వేరువేరుగా కిరణ్‌కుమార్‌ను సన్మానించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకుపోయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన శివకుమార్ అక్టోబర్ 29న బైక్‌పై వెళ్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గుర్తించి, రికవరీ చేశామన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయినా, పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలు పొందుపర్చాలని సూచించారు.

మొసళ్ల కలకలం



ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్‌లోని పీర్లబావిలో మొసళ్ల సంచారం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ శాఖ అధికారి రజనికాంత్ బృందం శుక్రవారం సందర్శించి బావి పరిసరాలను పరిశీలించారు. రెండు మొసళ్లు ప్రతినిత్యం బావి గట్టుపైకి వస్తున్నాయని, జనసంచారంలో ఉండడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలోనే వలల ద్వారా మొసళ్లను పట్టుకుంటామని, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులు



ఖిల్లాఘనపురంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ తదితరులు

ఖిల్లాఘనపురం: విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈఓ జయశంకర్, యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు కాగితాల మధు అన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన వారు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చిన్నప్ప, టీఎంఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శోభారాణి విద్యార్థులకు గణితంపై పలు సూచనలు, మెలుకువలు ఇచ్చారు. టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పరీక్షల్లో ఓటమి చెందినంత మాత్రాన వెనకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగినప్పుడే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మునావర్ సుల్తానా, చెన్న, కాళిదాసు, శారద, ఆనంద్, భాను, కృష్ణయ్య, శ్రీనివాసులు, రాజేష్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలి

వీపనగండ్ల: పరిశుభ్రమైన ఆహారాన్ని అందించినప్పుడే హాస్టళ్లలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆమె సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆహారాన్ని అందివ్వాలని, ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి పలువురు ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

అమరచింత: సంక్షేమ హాస్టళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని సీఆర్‌పీ స్వామి అన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మండల శివారులోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి ఉదయం వేళ అందిస్తున్న టిఫిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఓతో మాట్లాడుతూ వంట గదితో పాటు వంట కార్మికులు శుభ్రత పాటించాలన్నారు. ఆహర ధాన్యాలు నిల్వ ఉంచే స్టోర్ రూంలో కూరగాయలు పాడవ్వకుండా, ఎలుకల సంచారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహర విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



వీపనగండ్లలో కేజీబీవీలో..



అమరచింత కేజీబీవీలో..

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి

పాన్‌గల్: పీహెచ్‌సీలో అందుతున్న మెరుగైన వైద్య సేవలపై గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పిస్తూ ప్రసవాల సంఖ్యను పెంచాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులుగా నమోదు చేయించుకున్న వారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడటంతో పాటు పౌష్టికాహారం తీసుకునే విధంగా చూడటం సిబ్బంది బాధ్యత అన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయడటం, కుష్ఠువ్యాధి, మధుమేహం, అధిక రక్తపోటు, క్షయ, క్యాన్సర్ వంటి రోగాల వివరాలపై సబ్‌సెంటర్ల వారీగా ఆరా తీశారు. దీంతో పాటు 102, 108 వాహనాలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు తారాశశాంక్, శ్రీకాంత్, మైథిలి, నిహారిక, నాగరాజు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

నేటి నుంచి 'ఉపాధిహామీ' సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న స్టేట్ రీసోర్స్ పర్సన్ ముత్తయ్య

గోపాల్‌పేట: మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీలు శనివారం చేపడతామని స్టేట్ రీసోర్స్ పర్సన్ ముత్తయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. 2023–24 సంవత్సరంలో మండలంలో జరిగిన రూ.5.69కోట్లకు సంబంధించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల రికార్డులను పరిశీలించనున్నారు. శుక్రవారం నుంచి గ్రామాల్లో తనిఖీలు చేసిన అనంతరం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఉంటుందని ఏపీఓ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

గోపాల్‌పేట: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు జబ్బార్ కోరారు. శుక్రవారం అయన మండలంలోని తాడిపర్తి, గోపాల్‌పేటలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించారు. రైతులకు సన్నవడ్లకు ఇస్తున్నట్లుగానే లావు రకం వడ్లకు సైతం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని కొన్ని సెంటర్లలో టార్పాలిన్ కవర్లు లేవని, సరిపోయినన్ని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే కొన్ని సెంటర్లలో 41 కేజీల 300 గ్రాములు, నాలుగు వందల గ్రాములు కొలుస్తున్నారని దీనివల్ల రైతులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని గోపాల్‌పేట ఐకేపీ సెంటర్‌లో మిషన్లు సరిగా పనిచేయడం లేదని, వడ్లు తేమశాతం మిషన్‌లో పోయకుండా చూస్తే ఏడెనిమిది తేమశాతం తేడా చూపుతోందని, వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి, రైతులు కురుమన్న, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్, నాయకులు

గ్రామపంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



మదనాపురం: తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, దానికి సంబంధించిన జీఓ నెంబర్ 51ను సవరించడంతో పాటు మల్టీ పర్పస్ వర్కస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీఓ ప్రసన్నకుమారికి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో 12,790 గ్రామపంచాయతీలు ఉండగా.. సుమారు 60 వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆయన వాపోయారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజు, రఫిక్, శ్రీను, అశోక్, శ్రీనివాసులు, ఉమాశంకర్, ఖాదర్, ఎస్ శ్రీనివాసులు, బి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

అమరచింత: మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన ఆరుగురిని ఆత్మకూర్ సబ్‌మెజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరుపర్చినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఆరుగురిలో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమాన కాగా మరో వ్యక్తికి మూడు రోజుల సాధారణ జైలు శిక్షను విధించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

గోపాల్‌పేట: మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించే సీఎం సభకు కార్యకర్తలు, రైతులు భారీగా తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి గోపాల్‌పేట మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొంకి వెంకటేష్, రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధిని అటకెక్కించిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఆర్టీఐ జిల్లా చైర్మన్ కొంకిరమేష్, టౌన్ ప్రెసిడెంట్ శివన్న, తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించే రైతు పండుగకు కార్యకర్తలు హాజరుకావాలని వినయ్‌కుమార్‌రెడ్డి, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండశ్రీను కోరారు.

చెకుముకి పరీక్షలు



వనపర్తి రూరల్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో జి వైష్ణవి, ఎం మహేశ్వరి, జోష్న మొదటి బహుమతి సాధించారని హెచ్‌ఎం వరలక్ష్మి తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీచర్ రాధిక మాట్లాడుతూ డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో విద్యార్థులు పాల్గొంటారని ఆమె తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



ఆత్మకూర్: విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకు సృజనాత్మకతను పెంపొందించడానికి ప్రతిభా పోటీలు దోహదపడుతాయని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక జాతర మైదానం బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో మండలంలోని 10 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించారు. 2025 మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు వివరించారు. ఈ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు మొదటి స్థానంలో నిలువగా.. ఆరేపల్లి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, వ్యాఖ్యాతలు శ్రీరాం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



వీపనగండ్ల: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభను చాటారు. ఇంగ్లిష్ మీడియంలో మనోజ్, అశోక్, వీపనగండ్ల పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలువగా.. కల్వరాల విద్యార్థి అభినవ్ మూడో స్థానంలో నిలిచారు. అలాగే తెలుగు మీడియంలో గోవర్ధనగిరి విద్యార్థి చరణ్, బొల్లారం గ్రామానికి చెందిన నందిని, కల్వరాలకు చెందిన వెంకటేష్ ప్రతిభ చూపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింహులు, జీహెచ్‌ఎం భాను ప్రకాష్, గణిత ఫోరం సభ్యులు ఆనంద్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, బక్కన్న, శ్రీనివాసులు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థికసాయం

వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన సునీత గురువారం మృతి చెందారు. ఈమె భర్త గతంలో మృతి చెందడంతో వారి పిల్లలు ఐదుగురు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న చిమనగుంటపల్లి పడమటి తండా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భద్రునాయక్ మానవత్వంతో స్పందించి శుక్రవారం గ్రామంలో చిన్నారులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ సాధన



ఖిల్లాఘనపురంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. కేసీఆర్ చేపట్టిన దీక్షకు గుర్తుగా శుక్రవారం మండలంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తాలో కేసీఆర్ చేపట్టిన నాటి దీక్ష చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కృష్ణయ్యగౌడ్, తిర్మలేష్, బాలస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగయ్య, సుక్కన్న, నల్లమద్ది రవీందర్‌రెడ్డి, చిన్న అంజనేయులుగౌడ్, పెద్ద అంజనేయులుగౌడు, చెన్నారెడ్డి, బదుగని చెన్నయ్య, కాశీనాథ్, మల్లారెడ్డి, కుర్మయ్య, చెన్నయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి ఆధ్వర్యంలో..

అమరచింత: పట్టణంలో జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. జాగృతి రాష్ట్ర నాయకుడు సయ్యద్‌కలాం ఆధ్వర్యంలో మిఠాయిలను పంచిపెడుతూ సంబురాలను చేశారు. నాడు స్వరాష్ట్రం కోసం ఎంతో మంది ఉద్యమంలో ప్రాణాలను కోల్పోయారని, కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అమరణ నిరాహార దీక్షతోనే స్వరాష్ట్రం సిద్ధించిందన్నారు.

'కేసీఆర్ వల్లే తెలంగాణ సిద్ధించింది'

వీపనగండ్ల: మాజీ సీఎం కేసీఆర్ చొరవ వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్ అన్నారు. 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కేసీఆర్ ఆమరణ నిరహార దీక్షకు పూనిన నవంబర్ 29వ తేదీని దీక్షా దివస్ తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమైన రోజుగా నిలిచిపోతుందని ఆయన అన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకే ప్రభుత్వంపై ఆరోపణలు



మాట్లాడుతున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన తొమ్మిది నెలల వ్యవధిలోనే ఇచ్చిన హమీలను అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తుంటే ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో అభివృద్ధి గురించి ఆలోచించని బీఆర్‌ఎస్ నాయకులు నేడు రాష్ట్రానికి మంచి జరుగుతుంటే భరించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించే రైతుల పండుగ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని, ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, అరుణ్ కుమార్, మహేందర్‌రెడ్డి, పోసిరిగారి విష్ణు, తిరుమలేష్, హనుమంతునాయక్, ప్రకాశం, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం



చెరువుకు పూజలు చేస్తున్న జూపల్లి అరుణ్

పాన్‌గల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, మండలంలోని ప్రతి ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి శివారులోని జాలు చెరువును కేఎల్ఐ కాల్వ నీటితో నింపిన సందర్భంగా స్థానిక రైతులు, మండల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత నెలలో గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామ రైతులు సాగునీటి ఇబ్బందులను తమ దృష్టికి తీసుకరావడంతో స్పందించి కాల్వలో పేరుకపోయిన పూడికను తొలగించి కాల్వ ద్వారా సాగునీరు సాఫీగా వచ్చేలా చేయడంతో గ్రామంలోని చెరువు నిండినట్లు ఆయన పేర్కొన్నారు. ఆకునోనిపల్లిలోని కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలపై ఆరా తీశారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ స్థానిక ఎన్నికలల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, భాస్కర్‌యాదవ్, పుల్లారావు, రాము యాదవ్, బ్రహ్మయ్య, కాంట్రాక్టర్ తిరుపతయ్యసాగర్, జయరాములుసాగర్ తదతరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

గోపాల్‌పేట: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వంద రోజుల్లో సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరం దాటినా నెరవేరవేదని వనపర్తి జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, వీలుకాకుంటే పేస్కేల్ అమలు చేస్తామని హన్మకొండ దీక్షా శిబిరంలో హామీ ఇచ్చినా.. నెరవేరలేదన్నారు. పదిహేను రోజుల్లో హామీని నెరవేర్చకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈనెల 18న విద్యాశాఖ కమిషనర్‌కు సమ్మెనోటీసు కూడా ఇచ్చామని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వహీద్, శ్రీనాథ్, రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖిల్లాఘనపురం: అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పురేందర్ రెడ్డిని శుక్రవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కుమార్తె సింగిరెడ్డి ప్రత్యూష పరామర్శించారు. మండలంలోని సోళీపురంలో ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

వైభవంగా బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

వనపర్తి రూరల్: మండలంలోని సవాయిగుడెంలో గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా పోచమ్మ గుడిని నిర్మించి, మూడు రోజుల పాటు పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా డప్పుల వాయిద్యాల మధ్య తెలంగాణ సంస్కృతి.. సంప్రదాయం ఉట్టిపడేలా శుక్రవారం పోచమ్మ బోనాలు గ్రామంలో కనుల పండువగా జరిగాయి. చిన్నారులు, మహిళలు బోనాలతో పోచమ్మ గుడి వద్దకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గుడి అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.2 లక్షల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న మాలధారులు

ఆత్మకూర్: హరిహారపుత్ర అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూర్‌లోని తాండూర్ సుదర్శన్ శెట్టి నివాసగృహంలో ప్రముఖ వేదపండితుడు గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామివారికి అభిషేకం చేశారు. ఈసందర్భంగా అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగింది. టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ గురుస్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొని గీతాలను ఆలపించారు. అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, చింతకుంట మండలాలకు చెందిన అయ్యప్ప మాలధారులు వేలాదిగా హాజరయ్యారు. అనంతరం దీక్షాపరులకు, భక్తులకు అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాండూర్ కిషోర్‌కుమార్, గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.